క్లుప్తంగా

సాయినాథునికి విశేష పూజలు



ప్రత్యేకాలంకరణలో బాబా

పొదలకూరు : పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో అర్చకులు గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకాలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శాశ్వత ఉభయకర్తల గోత్రనామాలతో పూజలు, సాయంత్రం భజనలు, పల్లకిసేవ గావించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి.

పాఠశాలలకు కంప్యూటర్ల వితరణ



వెంకటాచలం : రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ హెచ్‌ఎం ధూర్జాటి రాధాకృష్ణమూర్తి మండలంలోని సర్వేపల్లి, నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలకు రెండు కంప్యూటర్లను వితరణ చేశారు. హౌసింగ్ డీఈ సుబ్రహ్మణ్యం, పూడిపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఈపూరు శరత్‌బాబు చేతుల మీదుగా గురువారం ఈ రెండు కంప్యూటర్లను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేశారు.

పదో తరగతి ఎంతో కీలకం



విద్యార్థులకు సూచనలిస్తున్న విజిలెన్స్ సీఐ

కోవూరు : విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకమని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని విజిలెన్స్ సీఐ మాణిక్యరావు అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. విజిలెన్స్ తహసీల్దార్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ తప్పక అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహమూర్తి పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

అనంతరం వారు జగనన్న గోరుముద్ద పథకాన్ని తనిఖీ చేశారు. భోజన నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజు భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను ఆరాతీశారు.

ఉదయకళేశ్వరాలయంలో వేలం పాటలు



వేలంపాట జరుపుతున్న ఈఓ, ధర్మకర్తలు

కొడవలూరు : మండలంలోని గండవరంలో వెలసిన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వచ్చే మార్చి 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో దుకాణాలు, రంగుల రాట్నం తదితరాల నిర్వహణకు ఆలయ ప్రాంగణంలో ఈఓ శాంతయ్య ఆధ్వర్యంలో గురువారం వేలంపాటలు నిర్వహించారు. టెంకాయలు, పూజా సామగ్రి అమ్మకాలను రూ.1.73 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. గతేడాది వీటికి రూ.1.50 లక్షలు రాగా ప్రస్తుతం రూ.23 వేలు అదనంగా వచ్చింది. అదేవిధంగా క్యాంటిన్ నిర్వహణను రూ.47 వేల దక్కించుకున్నారు. గతేడాది రూ.40 వేలు రాగా ఈ ఏడాది రూ.7 వేలు అదనంగా లభించింది. రంగుల రాట్నం, స్వామి అమ్మవార్లకు నివేదించిన కొబ్బరి చెక్కల సేకరణ, తాత్కాలిక దుకాణాల ఏర్పాటు, చెప్పుల స్టాండ్, స్వీట్స్ అంగడి తదితరాలకు తగినంతగా పోటీదారులు లేకపోవడంతో వీటి వేలంపాటను వచ్చే నెల 2వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ శాంతయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో వవ్వేరు ఆలయ ఈఓ వరప్రసాద్‌రెడ్డి, ధర్మకర్త బాబురావు, అర్చకులు బండారు సుబ్రహ్మణ్యం, సర్వబొట్ల హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నేత రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

• ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం



మనుబోలు : ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మనుబోలు : ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు వజ్రాయుధం లాంటిదని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివకృష్ణయ్య సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ప్రలోభాలు, పక్షపాతానికి తావు లేకుండా ఓటు హక్కును వినియోగించుకుంటామని అధికారులు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు అనే ఆయుధం ద్వారా నీతి, నిజాయతీపరులైన వారిని ప్రజా ప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచించారు. ఆయన వెంట డీటీ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌ఎం డేవిడ్, వీఆర్వోలు నాగార్జునరెడ్డి, శ్రీనివాసులు, మురళీధర్, పెంచలబాబు తదితరులు ఉన్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

పొదలకూరు : ప్రతిఒక్కరూ ఓటు విలువ తెలుసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని తహసీల్దార్ కె.వీరవసంతరావు పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అధికారులు, స్థానికులతో కలిసి పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రలోభాలకు ఓటును అమ్ముకోవద్దని తెలిపారు. 18 ఏళ్లు నిండిన యువత స్వచ్ఛందంగా ఓటు హక్కు పొందాలన్నారు. అనంతరం కార్యాలయ వెలుపల సీనియర్ సిటిజెన్స్‌ను సన్మానించి ఎన్నికల్లో వారి అనుభవాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సాయిగణేష్‌బాబు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

వీఎస్‌యూలో..

వెంకటాచలం : మండలంలోని వీఎస్‌యూలో జాతీయ ఓటరు దినోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కె.సునీత, విద్యా ప్రభాకర్, ఉదయ్‌శంకర్ తదితరులు ఓటరు దినోత్సవం ప్రాధాన్యత గురించి తెలియజేశారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకుని, ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

సక్రమంగా వినియోగించుకోవాలి

కోవూరు : ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని, దీనిని సక్రమంగా వినియోగించుకోవాలని కోవూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి తెలిపారు. కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నామినేషన్ గడువు వరకు ఉంటుందన్నారు. ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కోవూరు ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, డీటీ ఇలియాజ్, ఎలక్షన్ డీటీ మధుసూదన్‌రావు, ఆర్ఐ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ సుధా, వీఆర్వోలు పాల్గొన్నారు.

బీఎల్వోలకు సన్మానం

నియోజకవర్గ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన ఆరుగురు బీఎల్వోలకు బాపిరెడ్డి చేతుల మీదుగా మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అవార్డులు అందుకున్న వారిలో కోవూరు మండలానికి సంబంధించి లేగుంటపాడు వీఆర్వో ఎం.నాగేశ్వరరావు, కొడవలూరు మండలానికి సంబంధించి మహిళా పోలీస్ బి.మేరీ హెప్సిబా, విడవలూరు నుంచి ఇంజినీరింగ్ అసిస్టెంట్ కె.సావిత్రమ్మ, ఇందుకూరుపేట నుంచి ఇంజినీరింగ్ అసిస్టెంట్ బి.ప్రవల్లిక, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ నుంచి వెల్ఫేర్ అసిస్టెంట్ మహతి, అర్బన్ నుంచి ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.పూజిత ఉన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఆరుగురు సీనియర్ సిటిజెన్లను శాలువా, పూలమాలతో కోవూరు ఆర్వో, నుడా వైస్ చైర్మన్ బాపిరెడ్డి సత్కరించారు. అదేవిధంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాపిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. తహసీల్దార్ సుబ్బయ్య, ఎలక్షన్ డీటీ మధుసూదన్‌రావు, డీటీ ఇలియాజ్ తదితరులు ఉన్నారు.



పొదలకూరు : సీనియర్ సిటిజెన్స్‌కు సన్మానం



వెంకటాచలం : ఓటరు దినోత్సవంలో విద్యార్థులు



కోవూరు : సీనియర్ సిటిజెన్‌ను సన్మానించిన కోవూరు ఆర్వో బాపిరెడ్డి

నేడు వెంకటాచలానికి మంత్రి కాకాణి రాక

వెంకటాచలం : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం వెంకటాచలానికి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య గురువారం తెలిపారు. ఉదయం 10.30కి వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొంటారన్నారు.

44 మద్యం బాటిళ్ల స్వాధీనం

మనుబోలు : మండలంలోని గురివిందపూడి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న దుకాణంపై పోలీసులు గురువారం దాడి చేశారు. ఎస్సై అజయ్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి చల్లా వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే 44 క్వార్టర్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ఖోఖో విజేత గుమ్మళ్లదిబ్బ

కోవూరు : బుచ్చిరెడ్డిపాళెంలో గురువారం జరిగిన నియోజకవర్గ స్థాయి మహిళా ఖోఖో పోటీల్లో కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ సచివాలయం జట్టు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గుమ్మళ్లదిబ్బ ఉన్నత పాఠశాల పీడీ మధుసూదన్‌రావు, పీఈటీ అజయ్‌లను ఎంపీడీఓ శ్రీహరి ప్రత్యేకంగా అభినందించారు.



ట్రోఫీ అందుకున్న ఖోఖో విజేతలు

విద్యార్థులకు క్రీడా దుస్తులు



ముత్తుకూరు : ముత్తుకూరు పంచాయతీలోని బలిజపాళేనికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత తంబి శ్రీనివాసులు తన కుమార్తె లక్ష్మీ వెంకట మనోజ్ఞ జ్ఞాపకార్థం స్థానిక డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం క్రీడా దుస్తులు బహూకరించారు. పాఠశాలకు సంబంధించి క్రీడాకారులుగా రాణిస్తూ వివిధ పోటీల్లో పతకాలు సాధించిన 30 మంది విద్యార్థినులకు ప్రిన్సిపల్ సుజాత, కృష్ణపట్నం ఉపసర్పంచ్ రాగాల వెంకటేశ్వర్లు చేతుల మీదుగా క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. వైస్ ప్రిన్సిపల్ సునీత, వ్యాయామ ఉపాధ్యాయులు శిరీష, స్పందన పాల్గొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జిప్సం అందుకున్న రైతులతో అధికారులు

ముత్తుకూరు : కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందజేసే ఎరువులు, జిప్సంలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. ముత్తుకూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం జరిగిన వేరుశనగ రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా 50 మంది వేరుశనగ రైతులకు ఎకరాకు నాలుగు బస్తాల చొప్పున జిప్సం పంపిణీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్ర సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్, మండల ఏఓ జ్యోత్స్నరాణి పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమానికి కృషి

• చిల్లకూరు సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

తోటపల్లిగూడూరు : పాడి రైతుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళగిరిలో బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సుధీర్‌రెడ్డి స్వగ్రామం పొట్లపూడిలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ క్రమంలో ఆయనకు పలువురు నేతలు, అభిమానులు శాలువా, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన తనకు రాష్ట్రస్థాయి పదవి లభించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు కాంగ్రెస్‌తో టీడీపీ జతకట్టి తనను విజయా డెయిరీ చైర్మన్ నుంచి దించితే నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రస్థాయి పదవి లభించినట్లు తెలియజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌కు, మంత్రి కాకాణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ఇసనాక రమేష్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్యగౌడ్, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు తలమంచి సురేంద్రబాబు, జెడ్పీటీసీ ఎంబేటి శేషమ్మ, ఏఎంసీ డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు అడపాల అవినాష్‌రెడ్డి, నేతలు ఎడిచర్ల శ్రీనివాసులుగౌడ్, వేగూరు శ్రీనివాసులు, హరిప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తూ బస్సులు నడపాలి



మాట్లాడుతున్న సీఐ శివాజీ

వెంకటాచలం : డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ బస్సులు నడపాలని నెల్లూరు నార్త్ ట్రాఫిక్ సీఐ శివాజీ సూచించారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న ఏపీఎస్‌ఆర్టీసీ జోనల్ శిక్షణ కేంద్రంలో గురువారం డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివాజీ మాట్లాడుతూ వాహనాలు నడిపే డ్రైవర్లు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రద్దీగా ఉండే రహదారుల్లో వాహనాలను చాకచక్యంగా, ఏ చిన్న పొరపాట్లకు తావివ్వకుండా నడపాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.ఆదాం సాహెబ్, ప్రిన్సిపల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి చూపాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

మనుబోలు : శ్మశానానికి దారి ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని జట్లకొండూరు పంచాయతీ అరుంధతీయవాడ వాసులు తహసీల్దార్ శివకృష్ణయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశానం దారి ఉన్న 462, 465 సర్వే నంబర్లో 20 సెంట్ల భూమిని అదే గ్రామానికి చెందిన ఓ రాజకీయ నేత ఆక్రమించుకుని తన పేరున రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకున్నాడని తెలిపారు. దీని కారణంగా శ్మశానానికి దారి లేకుండా పోయిందని, స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట ఉపసర్పంచ్ ఆవుల తులసీరామ్ ఉన్నారు.

ఏపీలో క్రీడలకు పెద్దపీట

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మహిళా విభాగంలో చాంపియన్ షిప్ ట్రోఫీని అందజేస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడలకు పెద్దపీట వేశారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. తోడేరు పంచాయతీలోని కాకాణి రమణారెడ్డి స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సర్వేపల్లి నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్రా క్రీడాపోటీల ముగింపు సమావేశంలో మంత్రి గురువారం పాల్గొని విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం జగన్ క్రీడలకు బడ్జెట్ కేటాయింపులు చేసినట్లు పేర్కొన్నారు. చంద్రబాబు హయాంలో క్రీడలకు బడ్జెట్ కేటాయింపులు చేసినా వారి ప్రచారానికి బయటి రాష్ట్రాల క్రీడాకారులను రప్పించి ఆడించినట్లు చెప్పారు. ప్రస్తుతం స్థానికులకు అవకాశం కల్పించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎదిగే విధంగా తయారు చేసేందుకు ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి స్థాయిలో రాణించిన వారు జిల్లా, రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలన్నారు.

రాష్ట్రస్థాయి విజేతలకు రూ.లక్ష నగదు

రాష్ట్రస్థాయిలో విజయం సాధించిన సర్వేపల్లి క్రీడాకారులకు ప్రభుత్వం అందజేసే నగదు బహుమతి కాకుండా వ్యక్తిగతంగా రూ.లక్ష నగదు అందజేస్తానని మంత్రి కాకాణి ప్రకటించారు. ఎన్ని జట్లు విజయం సాధిస్తే అన్ని రూ.లక్షలు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఓ సుస్మితారెడ్డి, ఎంపీడీఓ నగేష్‌కుమారి, డీఎస్‌డీఓ యతిరాజులు, సూపరింటెండెంట్ విజయకుమార్, ఎంపీపీలు సుబ్బరాయుడు, బుజ్జమ్మ, వైస్ ఎంపీపీలు వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సోమా అరుణ, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జెడ్పీచైర్మన్ తెనాలి నిర్మలమ్మ, సర్పంచ్ చిట్టెమ్మ, ఎంపీటీసీ లక్ష్మీకల్యాణి, సీనియర్ ఎంపైర్ అంజాద్, పూకోటి లక్ష్మీనారాయణ, వాకాటి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

విజేతలు వీరే

నియోజకవర్గ స్థాయి పోటీల్లో పురుషుల విభాగానికి సంబంధించి బ్యాడ్మింటన్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో పొదలకూరు, ముత్తుకూరు, టీపీగూడూరు, వాలీబాల్‌లో వెంకటాచలం, ముత్తుకూరు, పొదలకూరు, కబడ్డీలో టీపీగూడూరు, మనుబోలు, పొదలకూరు, ఖోఖోలో ముత్తుకూరు, వెంకటాచలం, పొదలకూరు, క్రికెట్‌లో ముత్తుకూరు, వెంకటాచలం, పొదలకూరు జట్లు విజేతలుగా నిలిచాయి. మహిళల విభాగంలో బ్యాడ్మింటన్‌లో టీపీగూడూరు, ముత్తుకూరు, పొదలకూరు, వాలీబాల్‌లో టీపీగూడూరు, మనుబోలు, వెంకటాచలం, కబడ్డీలో టీపీగూడూరు, వెంకటాచలం, పొదలకూరు, ఖోఖోలో టీపీగూడూరు, ముత్తుకూరు, వెంకటాచలం, క్రికెట్‌లో వెంకటాచలం, టీపీగూడూరు, పొదలకూరు జట్లు విజేతలుగా నిలిచాయి.

తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని సంగం బ్యారేజీ నుంచి బుచ్చిరెడ్డిపాళెం వరకు తాగునీటి ప్రాజెక్ట్ పైప్‌లైన్ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు సంబంధించి పైప్‌లైన్ పనులు ప్రారంభించామన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో ప్రాజెక్టును మంజూరు చేసినట్లు వివరించారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే ప్రసన్నకు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, రూరల్ కన్వీనర్లు మల్లికార్జునరెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ తరగతులు

నెల్లూరు (టౌన్): సోషల్ ఎమోషనల్ లెర్నింగ్, సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫర్ ఎంపథీ అండ్ కైండ్‌నెస్ అనే అంశాలపై నగరంలోని డీకే డబ్ల్యూ కళాశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ సూచనల మేరకు.. యునెస్కో వారి సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడారు. భారతీయ సంస్కృతి మూలాలను విద్యార్థుల్లో నింపాలని అధ్యాపకులకు సూచించారు. దాదాపు 180 మంది అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. యునెస్కో ఇండివిడ్యువల్ స్పెషలిస్ట్ శోభిత కళాశాల పీఆర్వో జోజీ పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సాయం

• సీనియర్ సివిల్ జడ్జి వాణి



కాలుష్య నియంత్రణ యూనిట్‌ను ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

ముత్తుకూరు : సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, దివ్యాంగులకు న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయం సాయం చేస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వాణి అన్నారు. మండలంలోని పంటపాళెంలో ఉన్న ఓ పామాయిల్ కంపెనీలో గురువారం కాలుష్య నియంత్రణ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన సదస్సులో కార్మికులనుద్దేశించి ప్రసంగించారు. కోర్టు ద్వారా తగాదాలు పరిష్కరించుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, దీనికి అధిక సమయం కూడా పడుతుందన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా సేవలు అందుకోవచ్చన్నారు. ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సీహెచ్ రాజశేఖర్, డీజీఎం రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అభినందన



కొడవలూరు : బాలికా దినోత్సవం సందర్భంగా ఈనెల 5న జిల్లాస్థాయిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 'బాలికల హక్కులు–చట్టాలు' అనే అంశంపై వ్యాసరచన, డిబేట్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ మూడు విభాగాల్లో గండవరం హైస్కూల్ విద్యార్థులు ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు. వ్యాస రచనలో బి.సుచిత్ర, డిబేట్‌లో వి.కృష్ణతేజ, పెయింటింగ్‌లో బి.శివానీ మొదటి బహుమతులు సాధించి రూ.5 వేల వంతున నగదు బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరిని ఆ పాఠశాలలో గురువారం ప్రత్యేకంగా అభినందించి ప్రోత్సాహాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ గుంజి నాగభూషణం, ఉపాధ్యాయుడు పి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారిణికి సన్మానం



భవానీని సన్మానిస్తున్న మంత్రి కాకాణి

పొదలకూరు : ఆడుదాం.. ఆంధ్రా క్రీడలకు స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరిస్తున్న ముత్తుకూరుకు చెందిన అంతర్జాతీయ పరుగు పందెం క్రీడాకారిణి వి.భవానీని తోడేరులోని స్టేడియంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం సన్మానించారు. ఇదే సభలో ఫుట్‌బాల్ క్రీడలో నేషనల్‌కు ఎంపికైన పొదలకూరు మండలం మహ్మదాపురానికి చెందిన ఎ.కావ్య, ఎస్‌హెచ్‌ఎఫ్ పోటీలకు ఎంపికైన పొదలకూరుకు చెందిన ఎస్.మౌనికలను కూడా మంత్రి సన్మానించారు.